# షరా

ఆ మనిషిని ఎక్కడో చూశాననిపించింది. కాని ఎంత ఆలోచించినా జ్ఞాపకం రాలేదు కృష్ణలంకలో నాకు ఎవ్వరితోనూ పరిచయం లేదు. నేను ఎన్నడూ ఆ లంకలో అడుగుపెట్టి కూడా ఎరగను.

మా ఊరు బెజవాడ దగ్గరదే అయినా నేను ఏడెనిమిది సంవత్సరాల నుంచీ మద్రాసులోనే వుంటున్నాను. ఈ ప్రాంతాలకు రాలేదు. ఇటీవల వొచ్చిన గాలివానకు పంటలన్నీ పాడైనయ్యని తెలుసుకొని పొలాలు చూచుకు వెళ్ళదామని వొచ్చాను. గాలివానవల్ల నిజంగా అపారమైన నష్టం కలిగింది. నేను ఎరిగినతర్వాత ఇంత నష్టం ఎప్పుడూ జరగలేదు. కవులు వాళ్ళు శిస్తు గింజలు కూడా రావని గోలపెడుతున్నారు. నేను ఏమి చెయ్యగలను! మళ్ళీ మద్రాసు వెళ్దామని బయలుదేరి, ఎలాగూ వచ్చాంగదా అని బెజవాడలో వున్న నా మిత్రుణ్ని వొకణ్ణి చూచిపోదామని బెజవాడలో దిగాను. అతను గాలివానకు నష్టపడినవారికి సహాయంచేసే ప్రయత్నంలో వుండి "రేపు వెళ్ళొచ్చులే" అంటే—అనాటికి ఆగిపోయాను.

ఆ సాయంత్రం బెజవాడ లంకలో నష్టపడ్డ బీదజనానికి వాసాలూ, తాటాకులూ పంచిపెడుతూ నన్నుకూడా రమ్మంటే నేనూ వెళ్ళాను. శరణార్థుల్లో కనుపించాడు ఆ మనిషి. ఆ మనిషి నన్ను చూచి కొంచెం బెరుకుపడ్డట్టుకూడా అనిపించింది నాకు నిజంగా ఆ మనిషిని నేను ఎక్కడో చూశాను, అందులో సందేహం లేదు. కాని ఏ సందర్భంలో చూశానో ఎంత ఆలోచించినా నాకు జ్ఞాపకం రాలేదు.

మేము పని పూర్తిచేసుకొని యింటికి వస్తుంటే ఒక రైతు మా వెంట వొచ్చాడు. అతనివల్ల ఆ మనిషి కోటిరెడ్డి మామ అని తెలుసుకున్నప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. కోటిరెడ్డిని నేను ఎరుగుదును.

అతనూ మద్రాసులోనే ఉంటున్నాడు. అతని మామను కూడా నేను ఎరుగుదును. ఒకసారి అతని అత్తవారి ఇంటిదగ్గర ఉండగా అతన్ని చూద్దామని వెళ్ళాను. అప్పుడే ఈయన్ని చూశాను. కాని గుర్తుపట్టక పోవటం నాతప్పు కాదు. మనిషి చాలా మారిపోయాడు.

*　　　*　　　*　　　*

నేను ఎట్లాగూ మద్రాసు వెళుతున్నాను గనక అల్లుడికేమైనా కబుర్లు చెబుతాడేమోనని మర్నాడు ప్రొద్దున్నే లేచి కోటిరెడ్డి మామను చూద్దామని లంకకి ప్రయాణం కట్టాను. ఆ లంకలో వుండున్నదంతా అలకాజనం. నాకు తెలిసినంతవరకు కోటిరెడ్డి మామ కొద్దిగా వున్నవాడే. కాని ఈ మధ్య ఏం జరిగిందో నాకు తెలియదు. స్వగ్రామంలో వున్న ఇల్లూ వాకిలి వొదులుకొని ఇక్కడ ఎందుకు కాపరం పెట్టాడోకూడా నాకు తెలియదు. కోటిరెడ్డి కూడా ఈ విషయం నాతో ఎన్నడూ ప్రస్తావించలేదు. అక్కడ వున్నవన్నీ చిన్న చిన్న పూరిగుడిసెలే. ఆ గుడిసెల్లో వొక గుడిసెలో కాపరం వుంటున్నాడు కోటిరెడ్డి మామ. నేను వెళ్ళేటప్పటికి ఆ స్థలంలోనే వున్న మరికొన్ని గుడిసెల్ని బాగుచేయిస్తున్నాడు. నన్ను చూచి కొంచెం తబ్బిబ్బుపడ్డాడు. ఇంటిలోకి వెళ్ళి నేను కూర్చోగలందులకు ఒక కుక్కిమంచం తెచ్చాడు. అతన్ని చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత హీనస్థితికి ఎందుకు వొచ్చాడా అని ఆలోచించ బుద్ధి ఐంది. మాటల్లోకి దింపాను. అతను అకును అంటకుండా సోకను పొందకుండా జవాబులు చెప్పాడు తన అల్లుడి సంగతి అడిగాడు. బాగానే వున్నాడని చెప్పాను. నేను అదీ, ఇదీ అడిగా గాని సరైన జవాబులు చెప్పలేదు. చివరికి; "నేను మద్రాసు వెళ్తున్నాను మీ అల్లుడికి ఏమైనా కబుర్లు చెపుతారా?" అని అడిగాను.

"ఇట్లా వుంటున్నామని చెప్పండి" అన్నాడు. నేను ఆయనదగ్గర సెలవుతీసుకొని మిత్రుని ఇంటికి బయలుదేరాను. దారిలో ముందురోజు కలిసినరైతు కలిశాడు. అతన్ని అడిగాను. కోటరెడ్డి మామనుగురించి.

"ఆయన ఆస్తి ఎందుకు పోయింది?" అని అడిగాను.

"ఆస్తిపోవటం ఏమిటండోయ్!" అన్నాడు ఆ రైతు.

"ఆస్తిపోకపోతే ఈ గుడిసెలో వుండవలసిన అవసరం ఏమొచ్చింది?" అన్నాను.

"అదా అండి....అట్లా అడగండి" అన్నాడు రైతు. అని ఈ విధంగా చెప్పాడు; "ఏమండోయ్ నాదీ ఆయన్ది వొక ఊరే... తెలుసా అండి....నాకాయన సంగతి బాగా తెలుసు....ఆస్తిపోయి రాలేదు...."

"మరెందు కొచ్చాడు?"

"సంపాదించటానికి వొచ్చాడు. అక్కడ ఇల్లూ, పొలం అమ్ముకొని వడ్డీకిచ్చి ఈ లంకిలో స్థలాలు చౌగ్గావున్నాయనీ, తొందరలో ధరలు పెరుగుతాయనీ తెలుసుకొని, ఇక్కడ స్థలం కొన్నాడు....రేపీ స్థలం అమ్ముతాడు....ఇంకొకచోట కొంటాడు.... ఆయన కేమండీ....చూశారూ.... ఈ స్థలం కొన్నాడా....కొని ఊరికేవుంటే యేమొస్తుందని నాలుగు గుడిసెలు వేయించి అద్దెకిస్తున్నాడు....కాని గాలివాన వొచ్చింరోజే గమ్మత్తంటే గమ్మత్తు...." అని నవ్వటం మొదలు పెట్టాడు.

కారణం తెలియకపోయినా, అతను నవ్వుతుంటే నాకూ నవ్వు వొచ్చింది. "ఏం జరిగిందేమిటి?" అని అడిగాను.

"అంతకు ముందు మూడురోజులనుంచీ గాలివాన కొడుతూ వుంది. ఆ రోజు మరీ ఎక్కువైంది. లంకలో వుంటానికి వీల్లేక అంతా ఊళ్ళోకి వెళ్ళారు తలదాచుకోటానికి. ఈయన్ని రమ్మంటే రాడే "ఈ ఇళ్ళు నన్ను కాపాడినై ....కష్టకాలంలో వాటిని విడిచిపెట్టి రాను" అంటూ కూర్చున్నాడు....ఆయన భార్య కూడా ఆయనకు తగ్గదే దొరికింది. "వొచ్చిన గాలివాన పోక వుంటుందా....వెళ్ళటం రావటం....ఇదంతా ఎందుకు?" అంటూ కూర్చుంది....వొచ్చిన గాలివాన ఎట్టాగూ పోతుందట!" మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

"చివరికి ఏమైంది?" అని అడిగాను.

"ఏమవుతుంది? వాళ్ళు రానంటే మాత్రం మేము ఊరుకుంటామా? వాళ్ళసంగతి దేవుడెరుగు వాళ్ళకొాక చంటిబిడ్డవుంది. ఆ చంటిబిడ్డ జోరున తడుస్తుంటే ఎట్లా చూస్తూ వూరుకోవటం....బలవంతంగా తీసుకువెళ్ళాం....అదుగో చూడండి ఆ కట్టెల అడితీ....అది దాటి రానంటాడే....తన ఇళ్ళకు వీలైనంత దగ్గర్లో వుండాలని ఆశ! ఆ రాత్రి ఆ కట్టెల అడితీలో పెట్టాం...మమ్మల్ని నానా మాటలూ అంటూ కూర్చున్నాడు....ఆయన అల్లుడి తరపు బంధువులు వూళ్ళో వున్నారు. వాళ్ళు వొచ్చి తమ యింటికి రమ్మని పిలిచారు. ఊహూ, ఎంత చెప్పినా వినడు....పైగా "మీరు ఆనాడు అట్లా చేశారు. ఈనాడు యిట్లాచేశారు. నా సంగతి మీకు పట్టిందా, ఈ కష్టంలో నన్నుచూసి నవ్వాలని వచ్చారు" అని మండిపడి పంపించాడు. ఎట్లాగో తెల్లవారేదాకా ప్రాణాలు బిగబట్టుకు కూర్చుని తెల్లవారి మళ్ళీ భార్యా సమేతంగా లంక ప్రవేశించాడు. అప్పటికి గాలివాన కొంచం తగ్గిందిగానీ యింకా యెవ్వరూ బయటకు రావటంలేదు. పాపం పడిపోయిన ఇళ్ళని చూడలేకపోయాడు వాటిని మళ్ళీ మామూలు ఆకారంలో చూస్తేగాని వుండలేకపోయాడు. భార్యనీ, చంటిపిల్లనీ పడని మొండిగోడలకు నాలుగు ఆకులు కప్పి, దాని క్రిందపెట్టి ఇళ్ళు నిలబెట్టటానికి పూనుకున్నాడు...." ఈ విధంగా ఆ రైతు చెప్పి చెప్పి, "పాపం అతనికి ఇప్పుడు ఒక్కటే దిగులు" అని పెదవి విరిచాడు.

"ఏమిటది?" అని అడిగాను.

"ఏముంది, పాపం! మొదట్లో తాను వుంటానికి వొక గుడిసె వేయించాడు. అద్దెలవాళ్ళ పోరుపడలేక ఆ గుడిసెలో సగం అయిదు రూపాయలకు అద్దెకిచ్చి మిగిలిన సగంలో తాను వుండేవాడు. అప్పటికీ అద్దెలవాళ్ళ పోరుతగ్గలేదు. అందుకని ఆ సగం కూడా అద్దెకిచ్చి పంచలో వుండేవాడు. ఆ పంచకూడా అద్దెకివాల్సి వొచ్చింది. అందుకని మరొక గుడిసె వేయాల్సి వొచ్చింది. కాని ఆ గుడిసెపనీ ఇంతే అయింది. ఎన్ని

గుడిసెలు వేయించినా, తాను కొంతస్థలం ఆక్రమించుకోవాల్సి రావటం, అంతమేరా అద్దె డబ్బులు దండగ అవటం జరుగుతూ వుంది....ఈ సమస్య ఎట్లా తీరుతుందా అని అతను రాత్రింబగళ్ళూ దిగులు పడుతూ వుంటాడు" అని చెప్పి పెద్ద పెట్టున నవ్వాడు.

నాకూ నవ్వు వొచ్చింది. ఆ రైతు చెపుతున్న పద్ధతి నాకు నవ్వు తెప్పించింది. కాని లోపల కోటిరెడ్డి మామ ఎందుకు మారాడా అని ఆందోళన కలగకపోలేదు. మొదట్లో నేను చూచినప్పుడు అతను చాలా మర్యాదస్తుడుగా కనిపించాడు. వూళ్ళో గౌరవంగా వుండేవాడు తాను తినేవాడు, ఇతరులకు పెట్టేవాడు. మర్యాదకు ప్రాకులాడే మనిషనే అనుకున్నాను నేను. ఇంతగా ఎందుకు మారాడో!

* * * *

ఆ రాత్రి మెయిల్లోనే నేను మద్రాసు జేరుకున్నాను. నా సొంత పనులు చూచుకుంటూ నాలుగు రోజులు కోటిరెడ్డిని కలవలేకపోయాను. అయిదోరోజు సాయంకాలం అతని ఇంటికి వెళ్ళాను. అతను ఇంట్లోనే వున్నాడు. ఏదో రాసుకుంటూ వున్నాడు. కాసేపు అదీ ఇదీ మాట్లాడి అతని మామను చూశాననీ, గాలి వానకు చాలా నష్టపడ్డాడనీ, ప్రస్తుతం బాగానే వున్నాడనీ మాత్రం చెప్పాను. అతను కాసేపు ఏమీ మాట్లాడలేదు. నెమ్మదిగా డ్రాయరు తీసి చదవమని వొక కార్డు ఇచ్చాడు. అది అతని మామ కూతురికి వ్రాసిన ఉత్తరం. అందులో ఇల్లా వుంది

"బిడ్డా,

నీవు వ్రాసిన పుత్తిరం అందినది. గాలివానవల్ల నష్టపడ్డా, భగవంతుని కృపవల్ల అట్టే నష్టం లేకుండానే తేరుకున్నాము గాలివాన తగ్గిన మర్నాడే, ఎవ్వరూ ధైర్యం చెయ్యకపోయినా, మీ అమ్మా నేనూ లంక ప్రవేశించి ఇళ్ళు నిలబెట్టాము మళ్ళీ వొక్కరొక్కరే అద్దెలవాళ్ళు ఇప్పుడిప్పుడే వొస్తున్నారు. ఇళ్ళు మళ్ళీ వేయించినందుకుగాను నెలకి యిది వరకంటే వొక రూపాయి ఎక్కువ ఇవ్వాలని మీ అమ్మ

అడుగుతూ వుంది. నువ్వు మాత్రం డబ్బు దగ్గర జాగ్రత్తగా వుండు. మీ ఆయన పుస్తకాలకనీ, వాటికనీ అనవసరంగా డబ్బు తగలవేస్తూ వుంటాడు. నువ్వు గట్టి పట్టుపట్టి డబ్బు ఖర్చు కాకుండా చూడు. ఆయనకు లేక పోయినా, నువ్వయినా నీ పిల్లల సంగతి చూచుకోవాలిగదా?"

ఈ విధంగా వ్రాసి షరాలో "చంటిబిడ్డ, జబ్బుచేసి మరణించిం"దని తెలియజేశాడు. నేను ఉత్తరం చదివి కోటిరెడ్డి వంకకు చూశాను.

"చూశావా, చంటిబిడ్డ మరణించటం ఆయన కంత స్వల్ప విషయంగా కనిపిస్తూ వుంది. ఆ గాలివానలో ఇటూ అటూ తిప్పి ఉంటారు, డాక్టరుకికూడా చూపి ఉండరు. తమ ఇళ్ళేమో, వడ్డీ డబ్బులేమో, అద్దెలేమో తప్ప మరింకొకటి వాళ్ళకు పట్టదాయె. పైగా చెప్పినవాళ్ళు పిచ్చివాళ్ళ కింద లెక్క. మొదటినుంచీ ఇలా ఉండేవాడు కాదు. కాని పొలం అమ్మి వడ్డీకిచ్చాడూ, అప్పటినుంచీ ఇట్లా తయారయ్యాడు. క్రమక్రమేణా మరీ అన్యాయం అయిపోతున్నాడు" అన్నాడు కోటిరెడ్డి.